ఆరాధన



బి. ఎ. ఎ. ప్రసాద్

ఆరాధన

బివివి ప్రసాద్

కవిత్వం
1986–1989

చిరునామా :
బివివి ప్రసాద్
S/o శ్రీ బొల్లిన అచ్యుతం
D.No. : 23-97
సజ్జాపురం తణుకు

రూ. 5

ముందుమాట

ఇది ఈ రచయిత వెలువరించిన మొట్టమొదటి కవితాసంపుటి. ఈ రచయిత పేరు బివివి ప్రసాద్. ఇట్లెందుకు చెప్పవలసి వచ్చినదనగా ఈతని పేరు ప్రవరల కంటే ముందుగా రచయితగనే నాకు పరిచయమైనారు కనుక. మా మిత్రులు శ్రీ జి.ఎస్.వి. నరసింహారావుగారు ఈ రచయితను నాకు పరిచయ మొనర్చి, వీరి కవితలను పరిశీలింపవలసిన అవసరమును కల్పించిరి. మేమిద్దరమూ కలిసి ఈ రచనలను చదువుకొన్నాము.

భావుకుడగు రచయితకు ఉండవలసిన ఔత్సుక్యమంతయూ ఈ రచయితలో పుష్కలముగా నున్నది. గుండెల లోతులలో కదలాడిన భావచ్ఛాయలు అభివ్యక్తిలో స్పష్టత సంతరించుకొనువేళ కావలసినంత పదసంపద అందుబాటులోనికి రాక అరవిరిసిన కుసుమము నుండి మకరందము నాస్వాదించు పుష్పంధయమునకు వలే పాఠకులకు భావతలములను తడిమి చూడవలసిన శ్రమ ఆవశ్యకమగుచున్నది. అందులకే అభ్యాసం మరింతగా ఈతని భావి రచనలను తీర్చిదిద్దవలసి యున్నది. భాష సరళ సాధారణ వ్యావహారిక శైలిలో నడచిననూ, తత్తాదృశ సంస్కారమునకు పొంగి పొరలిన ఈ రచయిత హృదయము ఆ బాసలోనే తన చేతనైన వాలకములతో అభినయించుటకు సమాయత్తమైనది. ఒక విధముగా ఆయా సందర్భములలో, ఆయా ప్రసంగములలో అలతి అలతి రూపములకు దిద్దిన అక్షర రూపములు ఏకత్ర సంగ్రథితములై ఈ రచయిత భావములకు అద్దము చూపుచున్నవి.

ఇందలి ముగ్ధభావముల అందచందములు భావనా సామాన్యమున పరిణతి చెందిన సహృదయ పాఠకులకు, ముద్దు గొలుపక మానవు. ప్రథమ ప్రయత్నమైననూ, ప్రకృష్ట యత్నముతో మది గుదిట గూర్చిన ఈ కవితారాధన ఈ రచయితకు ఆత్మసంతృప్తితో పాటు, భావి రచనా సముదాయమున ప్రౌఢిమా, పరిపూర్ణతలను కలిగింప వలయునని నిండు మనస్సుతో కోరుకొంటున్నాను.

చెరువు సత్యనారాయణశాస్త్రి
డిసెంబర్ 1989

నా మాట

నన్ను నేను వెదుకుకొనే ప్రయత్నమే ఇందులో ఉన్నది. ఇతరులలో తనని గుర్తించటాన్ని ప్రేమ అంటారనుకొంటాను. ప్రేమని తెలియచేయటంలో ఆరాధన ఒక పద్ధతి. ఆరాధించబడే వస్తువుని బట్టి, అది అనేక పేర్లతో పిలవబడుతుంది. ఏ పేరుతో పిలిచినా ఆరాధన లక్ష్యం, ఇతరులతో తాను మరింతగా ఐక్యం పొందటమే.

ప్రకృతి, స్త్రీ, అనుభూతులు, ఈశ్వరుడు వేటిని ప్రేమించినా, ఆ ప్రేమ తీవ్రమూ, గాఢమూ అయ్యే కొలదీ అది అన్నిటిపట్లా ప్రేమగా పరిణతి పొందుతుంది. ప్రతి ఒక్కదానిలో మిగతా అన్నిటినీ చూడగలుగుతాం. అంతలోనే ప్రేమ, అంతలోనే సంశయం, అంతలోనే కాంక్ష, అంతలోనే విరక్తి. మనం ప్రేమించే వాటిపట్ల కలిగే భావాలన్నీ నిజానికి మనపట్ల మనకు కలిగేవే. మనల్ని మనమే తెలుసుకొనే ప్రయత్నమే. మనం కల్పించుకొన్న బంధనాల్నుంచి స్వేచ్ఛ పొంది, మన ఉనికిని మరింత స్థిరంగా, భద్రంగా నిలబెట్టే ప్రయత్నమే ఇదంతా.

చివరికి వీటన్నిటా ఉన్నది మనమే అనీ, మనల్ని తెలుసుకోవటానికి అవరోధాలు మనలోనే ఉన్నాయనీ గ్రహించి, ఆ అవరోధాలని తొలగించుకోవటం ద్వారా మోక్షమనీ, సత్యమనీ, ఈశ్వరుడనీ పిలవబడే "నేను"ను తెలుసుకొంటాం.

ఈ పుస్తకం ఏ కొద్దిమందికో రసానందాన్ని కలిగించినా, ఏ కొద్దిమందికో నూతనాన్వేషణకి దారులు చూపినా, ఏ కొద్దిమంది సందేహాలకి సమాధానాలు ఇవ్వగలిగినా, సమస్యల నుంచి ఉపశాంతిని ఇవ్వగలిగినా ధన్యమైనట్టే.

సవిమర్శల ద్వారా, సందేహాల ద్వారా నేను ఎంతో నేర్చుకోవాలను కొంటున్నాను. రసజ్ఞులైన విమర్శకులకూ, జిజ్ఞాసువులకూ ఇదే ఆహ్వానం.

నా కోసం తమ అమూల్యమైన కాలాన్ని వెచ్చించి, నా కవిత్వంలోని తప్పు ఒప్పులని ఓపికగా తెలియచేస్తూ, అవసరమున్నంత మేరకి సాధ్యమైనంత వరకూ సంస్కరించిన శ్రీ చెరువు సత్యనారాయణశాస్త్రి నా కృతజ్ఞతాభివందనాలు.

నా పట్ల శిష్య వాత్సల్యంతో, కవిత్వం రాయటంలో మొదటినుండీ ప్రోత్సాహమిస్తున్న మా గురువుగారు శ్రీ జి.ఎస్. నరసింహారావుగారికి ఇప్పటికీ, ఎప్పటికీ విధేయతా పూర్వక అభివందనాలు.

బివివి ప్రసాద్

సాధ్యమైనంత అందంగా ముద్రించి ఇచ్చిన రవి ప్రింటర్స్, తణుకు వారికి, చక్కని ముఖచిత్రాన్ని గీసి ఇచ్చిన రాయల్ ఆర్ట్స్, పాలంగి వారికి ధన్యవాదాలు.

బివివి ప్రసాద్

"నిన్ను నీవు తెలుసుకో" అని ప్రభోదించిన

భగవాన్ శ్రీ రమణమహర్షి కి

ఈ పుస్తకం అంకితం ఇస్తున్నాను.

సామ్రాజ్యాలను జయించినా కీర్తి విస్తరిల్లినా
చిరుగాలికి ఊగే పచ్చగడ్డి మీదినుంచి జారిపడే
మంచుబిందువును చూసి మౌనంలో పడకపోతే
జీవితపు విలువలు తెలియవు

1.10.87

నా మౌనం అరణ్య నిశ్శబ్దాన్ని తాకినప్పుడు
నా నిట్టూర్పు కెరటాలచే ఆహ్వానించ బడినప్పుడు
నేను జీవించే ఉన్నానని నాకు స్పష్టమైంది

1.10.87

పిట్టల కూతలు గాలిని కావలించుకొని
ఉదయకాంతికి స్వాగతం చెబుతున్నాయి

మంచుబిందువు ముద్దులాడే పుష్పాన్ని
ఉదయకాంతి ఆశీర్వదిస్తుంది

పసిపాప నుదుటిని చిరుగాలి చుంబిస్తుంది
కనులు తెరవని పాప గాలికి చిరునవ్వుని అద్దుతుంది

చెరువులో జారిపడిన ఎండుటాకు
తన అనుభవాలని చెరువుకి వివరిస్తుంది.

అహంకారి మానవుడు మాత్రం
ఈ లోకంలో ఒంటరిగా మిగిలాడు

20.10.88

ప్రశ్నా పరంపరలతో నన్ను నేను వేధించుకొంటున్నపుడు
నన్ను తాకిన వాన చినుకు
ఆకాశంలో మెరిసే ఇంద్రధనస్సును చూడమని చెప్పింది

సప్తవర్ణాలలో నా చూపులు కరుగుతున్నపుడు
నన్ను గురించి, ఇంద్రధనువు గురించీ ప్రశ్నించాలన్న ధ్యాసే
నానుండి మాయమైంది.

22.1.89

ఉదయం వికసించింది
పుష్పాలు రేకులు విప్పాయి
తుమ్మెద వాలింది
గాలితెర కదిలింది

నా సంతోషం తెలిసిన మిత్రుడు
నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు

1.10.87

కురిసి వెలిసిన మేఘానికి ఆకాశం గొడుగు పట్టింది
దుమ్ము అణగిన నేల నుండి వేడిగాలి పైకి లేచింది
కిటికీల నుండి చూసే పిల్లలందరూ వీధులలోకి ఉరికారు
విశ్రాంతి అనంతరం ఊరు ఉత్సవం జరుపుకొంటుంది

ఆ సమయంలో వారిలో ఒకరిగా నేనూ అక్కడ ఉన్నాను

13.3.87

మరొక వేకువ నీకు నీరాజనం ఇవ్వటానికి వస్తుంది
పుష్పాలు తమ అలంకారాలను నీ కోసం సిద్ధం చేసుకొంటున్నాయి
నీకు దారి ఇవ్వటానికై మంచుపరదాలు ప్రక్కకు తప్పుకొంటున్నాయి
కానీ, నిన్న రాలిన ఎండుటాకు తన చివరి వీడ్కోలు తెలుపుతూనే ఉంది.

7.2.89

కొండకు కొట్టుకున్న కెరటాలు నీటిలోనికి జారుతున్నాయి
చలిమంటలు శీతల పవనాలతో ఆటలాడుకొంటున్నాయి
మేఘాలు జారే నీటికి మెరుపులతో వీడ్కోలు చెబుతున్నాయి
గాలి మౌనంతో చేయి కలిపి, చివురాకులను స్పృశి స్తోంది
వాటి చైతన్యాన్ని చూసి,
ఆనందమా నీ వెలాంటి దానివో కనుగొన జూస్తాను

26.4.87

నా జీవితాన్ని పాలించే మహారాజ్ఞీ!
నీ రాక కోసం
నా హృదయ మందిర కవాటాలు తెరిచి,
నా నిండా వెలుగు నింపుతాను
సజీవ, నిత్య చైతన్య ప్రకృతి సంపదకు
మన చిన్ని హృదయాల కలయిక
మణి కిరీటమై నిలవాలి
కాల ప్రవాహం వెంట సాగే
సాధారణ జీవన గమనం నుండి వేరుపరచి,
మన ప్రేమ మనలను
నక్షత్రాల కాంతిలో, అనంతత్వంలో, మౌనంలో
నిలిపి ఉంచుగాక!

26.10.87

బాట వెంట వృక్షాలు ధ్యానంలో మునిగి ఉన్నాయి
నీవు నడిచి వచ్చినపుడు మహారాజ్ఞీ
చెట్ల నీడలకు చైతన్యం వస్తుంది
రాలిపడిన పువ్వులు బాట నిండా పరుచుకొన్నాయి
గాలి తాకిడికి నిరుత్సాహంగా మూలలకు కదులుతున్నాయి
క్షణకాలపు జీవితం ఎలాగూ కడతేరిపోతుంది
నీ ముఖ మండలానికి చిరుగాలి కెరటాన్ని ఎలాగూ అర్పించలేకపోయాను
దేవీ! నీ మృదు పద సంరక్షణ లోనైనా నా ఆఖరిశ్వాస విడువనీ

19.2.87

పుష్పం వికసించిన రోజున
మధుర మాతృభారంతో మైమరచిన తీవెను
మృదువుగా గాలి స్పృశిస్తోంది
విశ్వసీమల నుండి వచ్చిన శిశువు,
ఉల్లాసంగా కాళ్ళూ, చేతులూ ఆడిస్తోంది
నవ్వే ఆమె కంటిలో వెలుగు ప్రతిఫలిస్తోంది
బంధువులంతా
వికసిత వదనాలతో శుభాకాంక్షలు చెబుతారు
దినదినమూ పుట్టినరోజుగా అలంకరించుకొని
కాలం స్వాగతం చెబుతోంది

29.9.86

మన దాగుడుమూతలు మళ్ళీ మొదలు
ఒకరికొకరం దొరికిపోవాలనే ఆశతో ఆడుకొంటున్నాం
అనంతమైన క్షణాల తరువాత మనం మరలా కలుసుకొంటాము
మనం ఒకరికొకరం క్రొత్తవారం కావటం సంతోషాన్నే కలిగిస్తుంది

నేనెవరో తెలియనట్లు చూస్తావు
నాతో చెప్పించుకోవాలని నీ కోరిక
నీవే నేనని నీకు తెలుసని
నేను చెప్పకూడదనుకొన్నా నా చిరునవ్వు చెపుతుంది

మనం పరస్పరం ప్రేమించుకొన్న సంగతి
మన మనస్సులకు మాత్రమే తెలుసు
మన కన్నులు మన మధ్య పరిచయాలు లేనట్లే చూసుకొన్నా
మన మనస్సులలోని సౌందర్యం పరిసరాలను వెలిగిస్తూనే ఉంటుంది

30.7.89

నేనొక అల్పునిగా నీ దగ్గర బైట పడటం నాకు ఇష్టం లేదు
నీ నుండి నన్ను దాచుకోవాలని కాదు నా ప్రయత్నం
నీ సమక్షానికి కూడా అల్పత్వాన్ని మోసికొని రావడం తగదని నా భయం

నా పనులకి ఆధారం
మంచిచెడ్డల విచక్షణ కాదిప్పుడు
నీ కోసమా, కాదా అనేది మాత్రమే

నీవూ నేనూ దూరంగా ఉన్నప్పుడు
మనిద్దరి ప్రేమా మరింత స్పష్టమౌతుంది

ప్రేమికుని మనస్సు ~~ఈ~~ లోకంలో ఏకాకి అని
ప్రజలు జీవంలేని సానుభూతి చూపిస్తారు
ప్రేమికుని మనస్సు ఐశ్వర్యంతో నిండివుందని తెలిసినవారు
ప్రజల అమాయకత్వానికి నవ్వుకొంటారు

29.12.86

తెల్లవారక ముందే వాకిట నిలిచే అతిథికి
ఆతిథ్యం ఇవ్వగలిగేవి
ఉదయ పవనమూ, నీ చిరునవ్వూ ప్రియతమా

నా నిర్భాగ్యం ఏదో నా స్వంతానికి ఉందనీ
లేశ మాత్రం సంపద కలిగినప్పుడు
నీతో పంచుకోవటం వలన దానిని పెరగనీ

పడవ కడలి తీరం విడిచేటపుడు
నా సజల సంతోష నయనాలు
వీడ్కోలు చెప్పే నీ చేతులకై వెదుకుతాయి

నిశ్శబ్ద సాయంకాలం
చివరి రెమ్మ గాలికి వీడ్కోలు ఇస్తుంటే
నన్ను గుర్తుకు తెచ్చుకొంటావా

27.12.86

నీ విరహంలో నేను పడే బాధ కూడా
నాకు ఆనందాన్ని కల్గిస్తుంది
నీ విచ్చిన అమృతం మహిమ ఇది

వాగు ఒడ్డున నీ ధ్యానంలో కూర్చొన్నపుడు
నీ మృదు గమనమూ, కల భాషణమూ, నిర్మల హృదయమూ
నేను మరింత స్పష్టంగా దర్శించ గలిగాను

నీ తోడు లేని ఏకాంత సంధ్యలో
నీ స్మృతిలో కరుగుతున్నప్పుడు
నీ గాంభీర్యమూ, మౌనమూ, సౌందర్యమూ జ్ఞాపకం వచ్చాయి

నీ కోసం ఎదురుచూడటంలో ఆనందం పోయింది
నువ్వు రావని నమ్మటానికి ప్రయత్నించటంలో
ఆనందం వుంది ఇప్పుడు
ఏ విధంగానైనా
నీ గురించి ఆలోచించటం కావాలి మనస్సుకి

ప్రపంచ పరిభ్రమణం ఆగిపోనీవు
నీ గురించి నా వేదన మాత్రం తొలగనీకు
నాకు తెలుసు, నీ పట్ల నా వేదన
ప్రపంచానికి కూడా కొత్త శక్తి నీయగలదని

30.7.89

నా కన్నీటిధార, ఆమె మౌన రోదన
మా ఇద్దరి మధ్య నుంచీ అనంతవిశ్వానికి వ్యాపించిన దిగులు
బరువుగా నిట్టూరుస్తుంది
లోకానికి తానూ పాతదానినే అని చెప్పుకొంటుంది

రాత్రి వెన్నెలకి వణికే నక్షత్రాలూ
ఉదయ మంద్ర పవనానికి ఊగే వికసిత పుష్పాలూ
లోకంలోకి విశాలత్వంతో, స్వేచ్ఛతో చేతులు చాపుతున్నాయి
పాతదనం అనేదే తమకి లేనట్టు
నూతనత్వంతో తొణికిస లాడుతాయవి
వాటి సౌందర్యం
లోకంలో సంతోషం వినా ఏమీ లేదని చెపుతుంది

19.10.86

విశ్వమా! విశ్రాంతి లేని నీ నర్తనశాలకు
నన్ను ఆహ్వానించినందుకు కృతజ్ఞుడిని

నిట్టూర్పులు విడుస్తూ కదిలే కాలం
జాలిగా నన్ను చూసి నవ్వుతుంది
గాలి చల్లగా భుజంపైన చేయి వేస్తుంది
సాయంత్రం పక్షులు విశ్రాంతిగా
అరుణవర్ణాన్ని తాకుతూ ఎగురుతుంటాయి

బాధ తెలియకుండా బ్రతకాలనుకోని నేను
సముద్రం ఒడ్డున నిలిచి
నాకు లభించిన జీవితాన్ని తలుచుకొని గర్వపడతాను

25.9.86

కాలవాహిని వెంట
మరొక దినం కదిలిపోయింది

కాంక్షలతో, సందేహాలతో, వ్యాకులతలతో
ఎన్ని విధాల నలిగినా,
దిగులుగానో, తృప్తిగానో "ఇదీ జీవితం" అనుకోవటమే
అన్నిటికీ సమాధానం

ఈ ప్రపంచం ఇలాగే
నిరంతరం మరణిస్తూ, పునర్జీవిస్తూ
నూతనత్వంతో, బాధతో
ముందుకు సాగుతోంది

24.3.87

ప్రభాతకాంతి ఈ లోకానికి నూతన ఉత్సాహాన్ని ఇస్తుంది
భయం నుంచి ధైర్యానికి, నిరాశ నుంచి ఆశకి
లోకాన్ని మేల్కొలుపుతుంది
కానీ నా మనస్సింకా
రాత్రి చీకటి వలే, నిశ్శబ్దం వలే
భయ సంకోచాలతో ముడుచుకుపోతూనే ఉంది

దినం తరువాత దినం కదిలిపోతూనే ఉంది
నా ఉనికి గూర్చిన ప్రశ్న నిత్య నూతనమై పుడుతూనే ఉంది

ఎవరిని ప్రార్థించటానికి ఈ చేతులు పైకి ఎత్తను?
లేత ఎండనీ, పచ్చిక బయళ్ళనీ
లోకానికి కానుకలుగా ఇచ్చినవారినే
నాకు విశ్రాంతినీ, శాంతినీ ఇవ్వమని కోరుతున్నాను

29.7.87

బాధ వస్తుంది, పోతుంది
బాధ లేకపోవటమే సుఖం
సుఖం ఎక్కడ వుంది లోకంలో

కెరటం విశ్రమించిన అనంతరం
చిరుగాలి తెరవచ్చి అంది కదా

సుఖం వస్తుంది, పోతుంది
సుఖం లేకపోవటమే బాధ
బాధ ఎక్కడ వుంది లోకంలో

4.4.87

మానవుడు తాను ఒంటరివాడినని భ్రమపడినప్పుడు
నిశ్శబ్దపు చీకటి రాత్రి మెరిసే నక్షత్రాలు
సృష్టిని గురించిన ప్రశ్నలుగా దర్శన మిస్తాయి

మానవుడు తనని విశ్వ బాంధవుడని గ్రహించినప్పుడు
నిశ్శబ్దపు చీకటి రాత్రి మెరిసే నక్షత్రాలే
సృష్టి తత్వాన్ని మౌనంగా తెలియజేస్తాయి

నేనొక చీకటి గదిలో
నిర్విరామ శోకంతో నిండి వున్నప్పుడు
కాలం నా భుజాలపై మోయలేని బరువుగా తోచింది

నేను వెలుతురు లోనికి ప్రవేశించినప్పుడు
కాల ప్రవాహంలో నీటి బిందువునని గ్రహించాను

1.10.87

మంచుబిందువు వణికింది
గాలి మరొక్కసారి నిట్టూర్పు విడిచింది
కాల సాగరంలో మరొక క్షణం ఇగిరిపోయింది

ఆకాశానికి నక్షత్రాలు వీడ్కోలు పలుకుతూనే వున్నాయి
సాగరం ప్రభాత కిరణాలను ప్రసవిస్తూనే వుంది
నా గుప్పెడు హృదయం నాదానికి స్పందిస్తూనే వుంది
క్షణాల పరదాలను తొలగించుకొంటూ కాలం సాగుతూనే వుంది

బాధామయమైన ఆనందాన్ని కలిగించే యాత్ర నాది
ఇది అంతమౌతుందో లేదో తెలియదు
అంతమౌతుందేమో నన్న దిగులు పోలేదు

కంటి ఎదుట కనిపించిన క్షణం
వేగంగా రెప్ప మాటున అదృశ్యమై పోతుంది

గాలి వీచింది ఎండుటాకులు దొర్లాయి
అనంతర నిశ్శబ్దం కూడా ఆపలేదు
యాంత్రికంగా పడే అడుగులని

అరణ్య వృక్ష చ్ఛాయలో కాంత ఎదురుచూస్తుంది
ఆమె ప్రేమలో తాను ఏనాడో ఐక్య మయ్యానని
తెలిసిన ఈ యాత్రికుడు ఏ మాత్రం ఇక విశ్రమించడు

1.6.87

ఇప్పటిలాగే ఎల్లకాలమూ
ఇక్కడ వుండిపోవాలనే నా ఊహ

మరణం ఆహ్వానగీతం పాడిన రోజున కూడా
ఆ మరుసటి రోజు ఎలా వుంటుందో చూడాలన్న
ఆశ నాలో కలగవచ్చు
శాశ్వతంగా ఇక్కడ వుండే మార్గంలేదా అనిపించవచ్చు

కానీ, మరణమనేది వుంది గనుక
జీవితమింత విలువైనది అయింది
అవిశ్రాంత కార్య కలాపాలూ, అంతులేని స్తబ్దతా
వెంట పడుతున్నా
నా జీవితం పట్ల నేను తృప్తి పొందకుండా ఉండలేను

4.10.87

ఆలోచనల నుండీ, బాధల నుండీ
విశ్రాంతి పొందే రోజు వస్తుంది

దేహం దహనమైన మరుభూమిలో మొలిచిన పచ్చికని
పైరగాలులు నాట్యం చేయిస్తాయనీ
శీతాకాలపు మంచు బిందువులు చుంబిస్తాయనీ తలచినప్పుడు
ఆనందమూ, ఆశ్చర్యమూ కలుగుతాయి

ఈ లోకంలో
నేను చూసే సౌందర్యం నశించిపోవచ్చు
నేను ఉండాల్సిన కాలం కరిగిపోవచ్చు

కానీ, నన్ను ఆనందపరిచే ఊహలలో
సౌందర్యం మరింతగా పరిమళిస్తూనే వుంటుంది

4.10.87

"జననం నుండి మరణానికి
వారధి నిర్మించేది కాలం కాదు, ప్రేమ"

కడలి కెరటాలు ఉవ్వెత్తున ఎగురుతూ
నా స్నేహానికి చేతులు చాచినప్పుడూ

రాత్రి నా బాధల పల్లవిని మననం చేసుకొనేటప్పుడూ,
నక్షత్రాలు నా నుదుటిని ముద్దు పెట్టు కొన్నప్పుడూ,

సాయంత్రం ఉండి ఉండి గాలికి కదిలిన ఆకు
మౌనంగా నిలిచిన నన్ను "ఏమిటి విశేషాలు" అని అడిగినప్పుడూ,

నేను అమితంగా ప్రేమించే జీవితం నుండి
నన్ను అత్యమితంగా ప్రేమించే మృత్యువు వేరు చేస్తున్నప్పుడూ

నా ఆత్మీయుల జ్ఞాపకం నా కన్నులను వెలిగిస్తూనే వుంటుంది

8.2.89

అన్ని రోజుల లాగానే ఆ రోజు రానే వస్తుంది

మరణశయ్య పై చివరి క్షణాలలో ఇలా అంటాను
"పువ్వుల వలే, నక్షత్రాల వలే, వెన్నెల వలే, కెరటాల వలే
జీవితాలను పంచుకొన్న స్నేహితులారా ధన్యవాదాలు"

జీవితాంతం నీడలా వెంటాడి బాధపెట్టిన వ్యక్తి
కళాహీనుడై సమీపంలో నిలబడితే
ఈ పెదవుల వేడి చల్లారే ముందు
చివరిముద్దు అతనికి ఇస్తాను

4.4.87

నన్ను బాధ పెడుతున్న అనంత సౌందర్యం
నన్ను తనలో కలుపుకొనే రోజు వస్తుంది

ఆ రోజున
సముద్ర కెరటాల పై తేలివచ్చే గాలినై
పసివాళ్ళ చెంపలు నిమురుతాను

రాత్రి నిశ్శబ్దంగా భూమిపైకి జారే వెన్నెలనై
దంపతుల వలపులకు వన్నెలు తెస్తాను

అనంతకోటి నక్షత్రాలలో ఒక్కడనై
విశ్వ వికాసానికి సాక్షిగా నిలుస్తాను

అడవులలోని అనంత నిశ్శబ్దాన్నై
మౌన ద్వారానికి కావలి కాస్తాను

ఎడారి వ్యాపించినంత దూరం
కనిపించని వేడిమిలో కలిసివుండి
తెలియరాని గమ్యాలకు దారులు తీస్తాను

ఏటి గలగలలో, సాగరపు నురుగులో,
పచ్చికబయలులో, లేత ఎండలో
మీకు కనిపించకుండా వుండి
మీచే పూర్తిగా ప్రేమించబడతాను

1.6.87

దీపం కాంతికి
వస్తువులు వేయి అందాలతో ప్రకాశిస్తున్నాయి
గాలితెర విసురుకు
దీపంతో పాటు అంధకారంలో కలిసిపోయాయి!

వివిధ వర్ణాల విన్యాసంతో
సూర్యునికి ఎదురు నిలిచింది నీటిబుడగ
అది ప్రేలినా
ప్రవాహం ఏ నిమిత్తం లేకుండానే సాగిపోయింది!

దిక్కులని ఏకం చేసే దిశగా
గాలిపటం ఎగిరిపోతుంది
దాని త్రాడు తెగినప్పుడు
అది ఏ దిక్కు పోయిందో ఎవరికీ తెలియదు!

2.5.87

నిన్ను ఊహించటం కూడా రాని హృదయంతో
నీవు కావాలని ఆతృత పడుతున్నాను

మౌనంలో దాగిన నిన్ను పిలవాలని వెర్రిగా అరిచినా
ఆ పిలుపు నీకు అందదని తెలుస్తూనే ఉంది

నా గొంతు నీకు దగ్గర చేస్తుందో
దూరం చేస్తుందో నాకు తెలియదు

ఏమి కోరినా ఇవ్వటానికి నీవున్నావు
కానీ, ఏ కోరిక నిన్ను చేరుస్తుందో తెలియక నేనున్నాను

2.9.87

ముగిసిపోయే జీవితానికి
ఒకే ఒక ఆధారం నువ్వు

ప్రేమా, కరుణా కుసుమాలతో
నిన్ను ఆరాధించలేని క్షణాలలో కూడా
నువ్వు ఉన్నావనే ధైర్యం మాత్రమే వికసింప చేస్తుంది

నన్ను రక్షించమని కోరే శక్తి లేనప్పుడు కూడా
నువ్వు రక్షిస్తావనే ఆశ బలాన్ని ఇస్తుంది

ఉన్నట్టుండి నువ్వు నన్ను ఒంటరిగా వదిలేసినప్పుడు కూడా
నీపైన నమ్మకం మాత్రమే నన్ను కాపాడుతూ వుంది

9.12.88

కాలం కదులుతుంటే
కార్యకలాపాల మధ్య తిరుగాడుతూ
నీ స్పర్శ కోసం ఎదురు చూస్తూనే వున్నాను

ఏ కన్నీరూ ఈనాడు జారటం లేదు
ఏ మాటా మనస్సుకి అందటం లేదు

జాగ్రత్ సుషుప్తుల మధ్య, స్వప్నాస్వప్నాల మధ్య
కొట్టుమిట్టాడుతూ ఇక్కడ నేను
ఏ వినోదాలూ లేని చోట, ఏ విషాదాలూ తాకని చోట
కాంతితో నీవు

19.3.89

గర్వాన్ని బైటికి పొమ్మని ఆజ్ఞాపించింది మనస్సు
కానీ
తన మెడ పట్టుకొని తననే తోసుకోలేదని మరిచింది

"నేను" ఎక్కడ వుందో మనస్సుకి తెలియటంలేదు
"నేను" ను మనస్సే ఇంటిలో వుంచి బైట వెదుకుతుంది

నా చుట్టూ నువ్వున్నావని నమ్ముతున్నాను
నిన్ను చూపించగల కనులు
నాకున్నాయో, లేదో తెలియటం లేదు

27.3.89

బాధను దూరం చెయ్యమని అడగడం లేదు
బాధను నా లోలోతుల లోనికి ఆహ్వానించగల శక్తి నివ్వు

ఎక్కడ బాధా, ఆనందమూ ఏకమౌతాయో
అక్కడకు బాధే చేర్చగలదని తెలుసు

ధూళి కలిసే కుసుమం పాషాణం కన్నా ధన్యమైనది
నిస్తబ్ద స్థితి కంటే బాధ విలువైనది

వెన్నెలా, కెరటాలూ, వేకువా, పక్షుల రవాలూ
మానవుని అసంతృప్తీ, అరణ్యాల గాంభీర్యం
మా వెనుకనే, మా లోతులలోనే
సత్యం ఉందని చెపుతున్నాయి

కనుల ఎదుట కదిలిపోతున్నా
ఎవ్వరూ గమనించని రుచులన్నీ
నీ అనుగ్రహం వలన అనుభవం లోనికి వచ్చాయి

తండ్రీ -
దాగుడుమూతలు ఆడే పిల్లవాడు
దొరికినట్టే దొరికి తప్పించుకొన్నట్టు
ఎంత ప్రయాణం నీకోసం జరిగినా
ఇంకా నీవు అందకుండానే ఉన్నావు

22.12.88

"తండ్రీ నన్ను కాపాడు"
కొండలోయలు ప్రతిధ్వనించే టట్లు అరవనివ్వు
మేఘాలలా తల బాదుకోనివ్వు
తుపానులో కడలిలా సుడులు తిరగనీ, చెలరేగనీ

నిన్ను చేరాలన్నదే కోర్కె
నీవు కావాలన్నదే కోర్కె

అసంతృప్తి తో నిండుకొన్నది మనస్సు మంచుతెర
వెలుగు, వెలుగు
మూలమూలల్నీ తడిమి స్పృశించే వెలుగునివ్వు

"తండ్రీ నన్ను కాపాడు"

10.4.87

సూర్యాస్తమయాలన్నీ వృధాగా కదిలిపోతున్నాయి
తెరచాపవలే కొట్టుకొంటుంది మనస్సు

గాలి తాకిడికి చిరుదీపం ఊగిసలాడుతుంది
నీ మృదు హస్తాల మధ్య రక్షణ నివ్వు

జనసమూహం మధ్య దారి తప్పి ఏడుస్తున్నాడు పిల్లవాడు
నీ ఒడిలో అతనిని నిద్రపుచ్చు

ఆలస్యాన్ని భరించని విరహిణి వలే దగ్ధమౌతుంది మనస్సు
నీ నిరంతర మృదు ప్రేమ వర్షంలో దానిని ఊరడించు

సంపదలు సర్పాలలా వెంటవచ్చి కాటేస్తున్నాయి
సర్వ రోగ హరణా రక్షించమని వేడుకొంటున్నాను

24.4.87

నన్ను నేను క్షమించటం ద్వారా
ఇతరులని కూడా క్షమించనివ్వు
నన్ను నేను నమ్మటం ద్వారా
ఇతరులని కూడా నమ్మనివ్వు

ఇతరులని ఓదార్చటం ద్వారా
నన్ను నేను ఓదార్చుకోనీ
ఇతరులని ప్రేమించటం ద్వారా
నన్ను నేను ప్రేమించుకోనీ

20.6.89

పరాత్పరా,
నీవు తప్ప వేరేదీ నన్ను తాకనీయకు
నీ ఆనందమయ స్పర్శ లోనికి నన్ను కరుగనీవు

అనంత సృష్టి జాలముపై ప్రసరించే నీ కరుణ
తర్కమునకు అందనిది

మా వెలుపలా, లోపలా
మా కాల, కర్తవ్యములా
నిండి వెలుగుచున్న నీ చిరునవ్వు చూస్తున్నాను

నీ కొరకై పడిన దు:ఖము
నిన్ను చూపుట వలన అమూల్యమైనది
అనంత సంతోషములా, దు:ఖములా దహించి
నీ సామీప్యమొసగు ప్రభూ, ధన్యుడను నీ వలన

11.12.89

ఏ ప్రత్యేకమైన ఆస్తినీ నాకు ప్రసాదించకు
ఏ ఒక్కదానికో అంటుకొని
అన్నిటికీ దూరమయ్యే దుస్థితి కలిగించకు
మనసు అంతస్తులలో దాగివున్న
ఆశయాలనీ, జ్ఞాపకాలనీ తుడిచివెయ్యి

దివ్య సౌందర్య దర్శనం కోసం
తెరుచుకొనే ఉండాలి నా కన్నులు
విశ్వ సంగీతాన్ని వినటంలో
అడ్డుపడకూడదు నా చెవులు

13.4.87

నిన్ను చేరాలన్న కోరిక
ఈ హృదయం ఉన్నంత కాలం ప్రవహించనీ

నా అర్హతలను ఏ మాత్రం వృధా చేయకుండా
నిన్ను అర్థించటానికే వ్యయం చేయనీ

అన్ని కాలాలూ, అన్ని అవస్థలూ కలిగిన నీవు
పరిమిత పరిధుల నుండీ, అవస్థల నుండీ విముక్తుడిని చేయి

కాంతీ, నాదమూ, సౌందర్యమూ ఏకమైన చోటున ఉన్న ఈశ్వరా
కాంతిలో, నాదంలో, సౌందర్యంలో నేను కరిగేటట్లు అనుగ్రహించు

నన్ను పాలించే, లాలించే అనుభవాలు అనేకం
కాలం నాకు కానుకగా ఇచ్చింది

అనేక అనుభవాలు పుష్పాల వలె
నాకు సుగంధాన్ని ఇస్తున్నాయి

వాటిని నేను అనుక్షణమూ ఏరుకొంటూ వున్నా
ఈ హృదయపాత్రలో ఇంకా ఖాళీ ఉండనే వుంది

మరిన్ని అనుభవాల కుసుమాలని సేకరించి
నీ కోసం హారం సిద్ధం చెయ్యాలి

కడలిలో ఒదిగే వాన చినుకుని చూసినప్పుడు
నీవూ, నేనూ ఒకటే అన్న సత్యం నాలో నిలిచి ఉండనీ

శీతలోదయం పచ్చగడ్డిపై పరుచుకొన్న మంచుతెరలని చూసినప్పుడు
విశ్వమంతా నేనై ఉన్నానన్న విషయం గుర్తులో ఉండేటట్లు చెయ్యి

సృష్టి సౌందర్యం ఈ కంటిలో ప్రతిఫలించినప్పుడు
ఈ మేలి ముసుగు వెనుక వున్న నిన్ను కనుగొననీ

విశ్రాంతి కలిగించే వేణు గానం చెవుల పడినప్పుడు
సమస్తమూ తృటిలో నాకు స్ఫురించేటట్లు చెయ్యి

నీవు వస్తున్నావన్న ఆర్తిలో క్షణాల్ని కరిగించివెయ్యి
నిన్ను సమీపించాలన్న ఆతృతలో దూరాల్ని మాయం చెయ్యి

25.4.87

శరద్రాత్రి వెన్నెలలో
నేను అనంత విశ్రాంతి పొందినప్పుడు
నీ తేజస్సు నన్ను స్పృశించు గాక!

ఉదయపు గాలిలో
నా తుది నిశ్వాసం లయమైనప్పుడు
నీ మౌనం నన్ను స్వీకరించు గాక!

కడలి కెరటాలు
నా పాదాలు కడసారి తాకినప్పుడు
ఆకాశపు అవధుల నుండి నన్ను ఆహ్వానించెదవుగాక!

వికసిత కుసుమాలపై
నా తుదిచూపు ప్రసరించినప్పుడు
నన్ను నీలో కలుపుకొందువు గాక!

వర్షానంతరపు మేఘాల కన్నా శుద్ధంగా చేసావు
వాగునీటి కన్నా సరళంగా చేసావు
గాలికన్నా తేలికని చేసావు

నీవు ఏమీ చేయలేదనే వెర్రి మనసు
నీ అనుగ్రహానికి ఎదురుచూస్తుంది

నీకోసం ఏమీ చేయనక్కరలేదని
నీవే నా భుజం తడుతున్నావు
ఆర్తి మాయమైపోతుందన్న భయమే నానుండి పోలేదు

ప్రయాణాలు వద్దు. పరాకులు వద్దు
తండ్రీ -
నీవు కావాలి. నీవే కావాలి

4.5.87

ఏమీ ప్రశ్నించను నిన్ను
ప్రశ్న లేని సమాధానాన్ని ప్రసాదించావు నువ్వు

నాకు ప్రార్థించటం తెలియదు
ధ్యానించటం తెలియదు
నీ కొరకై యాత్ర చేయలేని పసివాడిని
హఠాత్తుగా నీ ఒడిలోనికి తీసుకొన్నావు

నీ దయా సముద్రం లోనికి తీసుకు వెళుతున్నపుడు
మాటిమాటికీ నా మనస్సు మూగపోతుంది

5.6.87

శరీరం మనస్సుకు బరువౌతుంది
జగతి మనసు కొక స్వప్నమౌతుంది

విశాల మైదానాల్లో వెన్నెల ఏకాంతంగా విశ్రమిస్తున్నపుడు
ఉదయపు మంచు తెమ్మెరలు పొలాలపై పవళిస్తున్నపుడు
నేనీ జగమంతా వ్యాపిస్తున్నాను

కానీ, ఈ జగమంతా నాలోనిదే అనే దశ
ఇంకా ఎంత దూరం?

నువ్వు నా ఎదుటే ఉన్నావు
నేనింకా కనులు మూసుకొనే
నిన్ను చూడాలని ప్రయత్నిస్తున్నాను

నా కనురెప్పలపై
నీ కాంతి ప్రసరించటం తెలుస్తూనే వుంది
స్వప్నాలను నేమరువేస్తున్న చిత్తం
నన్ను చూడనివ్వటం లేదు

ఏదో విధంగా నిన్ను స్మరించకుండా వుండలేని
బలహీనుడిని చేసావు
ఏపాటి సంతోషమో స్పృశించి నప్పుడు
"కృతజ్ఞుడిని ప్రభూ" అంటూ గానం చేసాను

అమితమైన బాధలో కూడా
నీపేరే ఆలపించాను

కాని ఇప్పుడు
వేటితోనూ తృప్తి పొందక
నిన్ను చేరటానికి ప్రయాణిస్తూనే వున్నాను

27.3.89

వెన్నెల మౌనంగా వర్షిస్తూనే వుంది
కెరటాలు భావికాలపు సమాచారాన్ని ఒడ్డుకు చేరవేస్తున్నాయి
సృష్టి నిరంతరమూ కాలాన్ని తన అలంకారాలతో సాగనంపుతోంది
నక్షత్రాలు నిశ్చలంగా సర్వానికీ సాక్షిత్వం వహిస్తున్నాయి

ఈ అందాలకు ఆధారం నీవేనన్న సత్యం నాకు తృప్తి నిస్తోంది

సంతోషమో, దుఃఖమో
తెలియకుండా వచ్చే కన్నీరు -
ప్రభూ -
నిన్ను పూజించటానికి
నాకు ప్రసాదించిన సంపద

2.1.87

నీకు భిన్నంగా కనిపించే ప్రతిదానిపైనా
నాకు స్పృహ లేనంత పరధ్యానాన్ని కలిగించు
నీవు ప్రతిఫలించే ప్రతిదానిపైనా
నాకు స్పృహ లేనంత ప్రీతిని పుట్టించు

26.4.87

సత్యమనే వజ్రాన్ని నాకు బహూకరించావు
నా సంపద నంతటినీ దానితో పరీక్షించి చూసాను
ఈనాడు నాకే సంపదా లేదు ఆ వజ్రం తప్ప

29.5.87

నేను చూస్తున్న ప్రతి ముఖమూ
నాకు చిరకాలం నుండీ పరిచయం గలదనీ
నా కనుల పడే ప్రతి సౌందర్యమూ
ఇంతకు మునుపే నా స్వంతమనీ అనిపిస్తుంది

నన్ను నా నుండి విడదీసి
నాలో కలపటం ఒక ఆట కాబోలును

గానం గానంగా దివ్యమైనది కాదు
మౌనం గానాన్ని తన దివ్యత్వాన్ని వ్యక్తం చెయ్యటానికి ఉపయోగిస్తుంది

ఖండం ఖండంగా సుందరమైనది కాదు
అఖండం ఖండాన్ని తన సౌందర్యానికి ఉపయోగించుకొంటుంది

23.1.87

“సౌందర్యం ప్రపంచానిది కాదు
సౌందర్యం పరమాత్ముని సొత్తు”

“ప్రపంచంలో సౌందర్యమే వుంది
ప్రపంచం పరమాత్ముని ప్రతిబింబం”

“సౌందర్యమేదో, కానిదేదో నాకు తెలియదు
ఏది ఉందో, ఏది లేదో నాకు తెలియదు
నాకు ఏమీ తెలియదు”

మరణానికి భయపడిన ప్రతిక్షణమూ
నేను మరణించే ఉన్నాను
జననం మరణం లేనిచోట
నేను యదార్థంగా వున్నాను

29.5.87

నిర్విరామంగా చూస్తూ వున్నా కడలి పొంగు విసుగు కలిగించదు
రోజూ చూస్తున్నా రోజా మొగ్గలు తమ వైపుకి ఆకర్షిస్తున్నాయి
ప్రతి చిరుగాలి తరగకూ మనసు కేరింతలు కొడుతోంది

వాటి నిత్య నూతనత్వం వాటిది కాదు
వాటి వెనుక దాగిన నీ చిరునవ్వులదే

29.12.86

నాకు సంతోషం కలిగినప్పుడు
దానిని పంచుకోగలవారి కోసం
వెర్రిగా చుట్టూ చూసాను

చిరునవ్వుతో నీవు కనిపించావు
నా సంతోషం మాయమైంది

నాకు దుఃఖం వచ్చినపుడు
దానిని పంచటం కోసం
ఆశగా వెదికాను

చిరునవ్వుతో నీవు కనిపించావు
నా దుఃఖం మాయమైంది

బయోడేటా

పూర్తిపేరు	: బొల్లిన వీర వెంకట ప్రసాద్		
పుట్టినతేదీ	: 21. 11. 1966		
పితామహులు	: బొల్లిన వీరన్న, సత్యనారాయణమ్మ-ముక్కామల, ప.గో.జిల్లా		
మాతామహులు	: భోగవల్లి సుబ్బారావు, సూర్యకాంతం-సూర్యారావుపాలెం, ప.గో.జిల్లా		
తల్లిదండ్రులు	: విజయలక్ష్మి, అచ్యుతం		
తోబుట్టువులు	: నాగేంద్రకుమార్, శ్రీ భవాని		
భార్యాపిల్లలు	: మాలతీదేవి, గాయత్రి, భార్గవి		
రచనలు	: ఆరాధన	(వచన కవిత్వం)	1989
	దృశ్యాదృశ్యం	(హైకూలు)	1995
	హైకూ	(హైకూలు)	1997
	పూలురాలాయి	(హైకూలు)	1999
	నేనే ఈ క్షణం	(వచన కవిత్వం)	2006
	ఆకాశం	(వచన కవిత్వం)	2011
	నీలో కొన్నిసార్లు	(వచన కవిత్వం)	2015
పురస్కారాలు	: ఆంధ్ర సారస్వత సమితి అవార్డు, మచిలీపట్నం		2004
	స్నేహనిధి పురస్కారం; విశ్వకళాపీఠం, హైదరాబాద్		2012
	ఇస్మాయిల్ కవితా పురస్కారం, కాకినాడ		2011
	గుంటూరుజిల్లా రచయితలసంఘం అవార్డు, గుంటూరు		2011
	నూతలపాటి కవితా సత్కారం, తిరుపతి		2011
	కె.వి.ఎస్. ఉగాది సాహిత్య పురస్కారం, ఏలూరు		2015
	తిలక్ అవార్డు, తణుకు		2016
చిరునామా	: బివివి ప్రసాద్, # 23-12-21, సజ్జాపురం, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ 534 211		
ఫోన్	: 90320 75415		
ఈ మెయిల్	: prasadbvv1@gmail.com		
బ్లాగ్	: bvvprasad.blogspot.in		

పసిపాప నుదుటిని చిరుగాలి చుంబిస్తుంది
కనులు తెరవని పాప గాలికి చిరునవ్వుని అద్దుతుంది

నీ విరహంలో నేను పడే బాధ కూడా
నాకు ఆనందాన్ని కల్పిస్తుంది

నిన్ను ఊహించటం కూడా రాని హృదయంతో
నీవు కావాలని ఆతృత పడుతున్నాను

కడలిలో ఒదిగే వానచినుకుని చూసినప్పుడు,
నీవూ నేనూ ఒకటే అన్నసత్యం నాలో నిలిచి ఉండనీ

గానం గానంగా దివ్యమైనదికాదు,
మౌనం గానాన్ని తన దివ్యత్వాన్ని వ్యక్తం
చెయ్యటానికి వుపయోగిస్తుంది.

ఆరాధన — బి. వి. వి. ప్రసాద్